సాక్షి రంగారెడ్డి

బుధవారం । 9 । ఆగస్టు । 2023



రైతుకు ఆదరువు

ద్రవరూప ఎరువులపై అవగాహన కల్పిస్తే రైతులకు పెట్టుబడి, దిగుబడిలో మేలు జరుగుతుందని భావిస్తున్నారు. 8లో▸



రూ.7.40 కోట్లు మంజూరు

కొత్త రైల్వే లైన్ ఏర్పాటు సర్వే కోసం కేంద్రం నిధులు మంజూరు చేసిందని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి చెప్పారు. 8లో▸



అతివేగంతో ప్రమాదం

బొలేరో అతివేగంగా బైక్‌ను ఢీకొట్టడంతో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. ఈ ఘటన ఆదిబట్ల పీఎస్ పరిధిలో జరిగింది. 8లో▸

న్యూస్‌రీల్

'క్రమబద్ధీకరణ'కు అక్టోబర్ 31 వరకు గడువు

కలెక్టర్ హరీశ్



ఇబ్రహీంపట్నం రూరల్: గతంలో రిజిస్ట్రేషన్ చేసుకోకుండా కేవలం నోటరీ ద్వారా కొనుగోలు చేసిన వ్యవసాయేతర భూముల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం వెసులుబాటు కల్పిస్తోందని కలెక్టర్ హరీశ్ తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. నగర పాలక సంస్థ, మున్సిపాలిటీల పరిధిలో నోటరీ భూములు కలిగి ఉన్న వారు మీ -సేవ ద్వారా అక్టోబర్ 31వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం జారీ చేసిన జీవో 84ను అనుసరిస్తూ, 125 గజాల లోపు స్థలం కలిగి ఉన్న వారి నోటరీ ప్లాట్లను ఎలాంటి రుసుము లేకుండా ఉచితంగా రెగ్యులరైజేషన్ చేయడం జరుగుతుందన్నారు. 125 గజాలు దాటిన వాటికి ప్రస్తుత సబ్‌రిజిస్ట్రార్ మార్కెట్‌ధర ప్రకారం స్టాంప్ డ్యూటీ రూ.5 పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుందన్నారు. మీ సేవ ద్వారా దరఖాస్తు చేసే సమయంలో నోటరీ డాక్యుమెంట్‌తో పాటు ఆ భూమికి సంబంధించిన లింక్ డాక్యుమెంట్లు, ఆస్తిపన్ను, కరెంట్ బిల్లు, నీటిపన్ను, చెల్లించిన రసీదులు, ఇతర ఆధారాలుంటే జత చేయాలని సూచించారు. నోటరీ భూముల క్రమబద్ధీకరణతో పూర్తి యాజమాన్య హక్కులు లభిస్తాయని, సులభంగా క్రయవిక్రయాలు జరపుకోవచ్చన్నారు. బ్యాంకు రుణాలు పొందే వెసులుబాటు ఉంటుందన్నారు. నోటరీ ద్వారా కొనుగోలు చేసిన భూముల క్రమబద్ధీకరణకు అర్హులైన వారు నిర్ణీత గడువు లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

రిలే నిరాహార దీక్షను విజయవంతం చేయండి

డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న చల్లా నర్సింహారెడ్డి తదితరులు

మీర్‌పేట: కార్పొరేషన్‌లో అధిక పన్నులు వసూలు చేయడాన్ని ఖండిస్తూ ఈ నెల 11, 12 తేదీల్లో మున్సిపల్ కార్యాలయం వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు శాంతియుతంగా రిలే నిరాహారదీక్ష చేపట్టనున్నట్లు డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి తెలిపారు. మీర్‌పేట మందమల్లమ్మ చౌరస్తాలోని పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటి పన్నులు తగ్గించాలని గతంలో ఎన్నోసార్లు ధర్నాలు చేసి వినతిపత్రాలు సమర్పించడం జరిగిందని, దీంతో మంత్రి సబితారెడ్డి కౌన్సిల్ సమావేశంలో బహిరంగ ప్రకటన చేసి పెంచిన నూతన పన్నులను ఎవరూ చెల్లించొద్దని చెప్పడం జరిగిందన్నారు. అయినప్పటికీ అధికారులు ప్రజల నుంచి ముక్కుపిండి వసూలు చేస్తున్నారని ఆరోపించారు. పన్నుల భారం తగ్గించేందుకు రెండ్రోజుల పాటు చేపట్టనున్న రిలే నిరాహారదీక్షను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం రిలే నిరాహారదీక్ష సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు చల్లా బాల్‌రెడ్డి, సిద్దాల శ్రీశైలం, ఏడుదొడ్ల సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాల్లో ప్రాధాన్యత ఇవ్వాలి



సమావేశమైన దివ్యాంగులు

ఇబ్రహీంపట్నం: ప్రభుత్వ పథకాల్లో దివ్యాంగులకు ప్రాధాన్యత ఇవ్వాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర కార్యదర్శి ఎం. అడివయ్య డిమాండ్ చేశారు. ఇబ్రహీంపట్నం మార్కెట్ యార్డు ఆవరణలో మంగళవారం ఆ వేదిక జిల్లా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డబుల్ బెడ్రూం ఇళ్లు, దళిత బంధు, గృహలక్ష్మి పథకాల్లో ప్రాధాన్యం ఇవ్వకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. జిల్లాలో 2,056 మంది దివ్యాంగుల పింఛన్లు పొందుతున్నారని, పోస్టుఫీసుల ద్వారా వచ్చే పింఛన్లలో రూ.16 ఇవ్వడంలేదన్నారు. దివ్యాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని, జీఓ నంబర్ 1 ప్రకారం ప్రభుత్వ పథకాల్లో 5 శాతం కేటాయించాలని, 2016 దివ్యాంగుల పరిరక్షణ చట్టం పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎ.భుజంగారెడ్డి, కార్యదర్శి రాజు, ఉపాధ్యక్షుడు జంగయ్య పాల్గొన్నారు.

'కలక'లం



వేగంగా విస్తరిస్తున్న వైరస్

- జిల్లాలో పెరుగుతున్న ఐఫ్లూ కేసులు
- ఆస్పత్రులకు క్యూ కడుతున్న బాధితులు
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు

షాబాద్: కళ్లకలక (ఐఫ్లూ) జిల్లావాసులను కలవరపెడుతోంది. రోజుకు సగటున 1,521 మందికి ఐఫూల్ సోకుతున్నట్లు వైద్యులు అంచనా వేస్తున్నారు. సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లో 2వేల మందికి ఐఫ్లూ సోకడం ఆందోళన కలిగిస్తోంది. రోజురోజుకూ ఆస్పత్రులకు క్యూ కడుతున్న బాధితుల సంఖ్య పెరుగుతోంది. జిల్లాలో వివిధ ఆస్పత్రులకు నిత్యం 60 నుంచి 70 మంది వరకు వస్తున్నారు. వర్షాకాలం కళ్లకలక రావడం సాధారణమే అయినప్పటికీ వాతావరణంలో మార్పుల కారణంగా ఈసారి వేగంగా వ్యాప్తి చెందుతోందని వైద్యులు చెబుతున్నారు. తగిన జాగ్రత్తలు పాటిస్తే అరికట్టవచ్చని సూచిస్తున్నారు.

ఐఫ్లూ లక్షణాలు..

- బ్యాక్టీరియా, వైరల్, అలర్జిక్ ద్వారా కళ్ల కలక వ్యాప్తి చెందుతుందని వైద్యులు చెబుతున్నారు.
- అలర్జిక్ ద్వారా వ్యాధి స్వల్పంగా వ్యాప్తి చెందే అవకాశం ఉండగా బ్యాక్టీరియాతో 20 శాతం, వైరల్ ద్వారా 80 శాతం వ్యాపిస్తుంది.
- సాధారణంగా ఆడినో వైరస్ ద్వారా వ్యాప్తి చెందుతుంది. కళ్లకలక వచ్చిన వారికి కళ్లలో నీరు కారడం, ఎరుపెక్కడం, దురద వంటి లక్షణాలుంటాయి.
- కొన్నిసార్లు కళ్లు ఉబ్బడం, రెప్పలు అతుక్కొని చూడలేని పరిస్థితి ఎదురవుతుంది.
- కొన్నిసార్లు తీవ్రమైన జలుబుకులోనై కళ్లకు దురద రావడంతో తరచూ చేతులతో రుద్దుతుంటారు. దీంతో సమస్య మరింత పెరుగుతుంది.
- ఐఫ్లూ ఎక్కువగా వర్షాకాలంలో వ్యాపిస్తుంది. గాలిలో తేమ ఎక్కువగా ఉంటుంది. దీంతో వైరస్ వ్యాపించే అవకాశం, మనగలిగే అవకాశం అధికంగా ఉంటుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- బాధితులు కనీసం వారం రోజుల పాటు ప్రత్యేకంగా ఒక గదిలో ఉండాలి.
- శుభ్రమైన గుడ్డతో గోరువెచ్చని నీటితో తుడుచుకోవాలి.
- కళ్లకలక సోకిన వారు తరచూ కళ్లను తాకాల్సి వస్తుంది. అలా తాకిన ప్రతీసారి చేతులు శుభ్రం చేసుకోవాలి.

ఆందోళన వద్దు



కళ్లకలక వచ్చిన వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. వైద్యుల సలహా మేరకు చికిత్స పొందాలి.వారం రోజుల్లో తగ్గుతుంది. కొంతమందికి పక్షం రోజులు పట్టే అవకాశం ఉంటుంది. బాధితులు భౌతిక దూరం పాటిస్తే ఇతరులకు వ్యాప్తి చెందకుండా ఉంటుంది.

– డాక్టర్ శ్రీనివాస్, షాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

వైద్యులను సంప్రదించాలి



కళ్లకలక వచ్చిన వారు చేతితో కళ్లను తాకరాదు. ఇతరులకు దూరంగా ఉండాలి. వీరు వాడిన దుస్తులు మరొకరు వినియోగించరాదు. ఐడ్రాప్స్ వేసుకోవాలి. ఆస్పత్రిలో మందులు అందుబాటులో ఉన్నాయి. వైద్యులను సంప్రదించి చికిత్స చేయించుకోవాలి.

– డాక్టర్ వరలక్ష్మి, చందనవెల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

ఆబ్కారీ ఆదాయం బాగా పెరిగింది

- మంత్రి శ్రీనివాస్ గౌడ్

హయత్‌నగర్: ఎక్సైజ్ శాఖ అధికారుల సమర్థత కారణంగా ఆబ్కారీ ఆదాయం బాగా పెరిగిందని, ప్రభుత్వాన్ని నడిపించే ఆదాయంలో ఎక్కువ భాగం ఈ శాఖ నుంచే వస్తోందని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మంగళవారం హయత్‌నగర్‌లో ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ భవన నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డితో కలిసి ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గతంలో నిధుల లేమితో ఎక్సైజ్ శాఖ అధ్వాన స్థితిలో ఉండేదన్నారు. ఆదాయం అంతా పాలకుల జేబుల్లోకి వెళ్లేదని చెప్పారు. తెలంగాణ వచ్చిన తర్వాత ఆదాయం ప్రభుత్వ ఖజానాకు చేరుతోందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ తీగల అనితా హరినాథ్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి, ఎక్సైజ్ శాఖ కమిషనర్ ముషారఫ్ ఫరూఖీ, డిప్యూటీ కమిషనర్ డేవిడ్ రవికాంత్, అసిస్టెంట్ కమిషనర్ చంద్రయ్య, డిప్యూటీ ఈఓ రవీందర్‌రావు, ఏఈఎస్ హనుమంతరావు, హయత్‌నగర్ ఎస్‌హెచ్ఓ లక్ష్మణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

రెండో ఏఎన్‌ఎంలను క్రమబద్ధీకరించాలి



సీఎం కేసీఆర్‌కు పోస్ట్‌కార్డులు పంపుతున్న సెకండ్ ఏఎన్ఎంలు

- సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు జక్కుల పద్మ

అబ్దుల్లాపూర్‌మెట్ : రెండో ఏఎన్‌ఎంలుగా విధులు చేపడుతున్న వారి ఉద్యోగాలను తక్షణమే క్రమబద్ధీకరించాలని సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు పద్మ డిమాండ్ చేశారు. తమ ఉద్యోగాలకు భద్రత కల్పించడంతో పాటు డిమాండ్లు నెరవేర్చాలంటూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కొన్ని రోజులుగా చేపడుతున్న నిరసన కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలో సీఎం కేసీఆర్ కు పోస్ట్ కార్డులు రాసి పంపించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 32 రికార్డులను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ చేస్తూ ప్రభుత్వం ఇస్తున్నఅన్ని టార్గెట్లను పూర్తి చేస్తున్నామని అన్నారు. తమ శ్రమను ప్రభు త్వం గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. శాంతియుత పోరాటం చేస్తూ ఈనెల 4న 'చలో అసెంబ్లీ' చేపట్టేందుకు సిద్ధపడితే మహిళలు అని కూడా చూడకుండా అర్ధరాత్రి అక్రమంగా అరెస్ట్ చేశారని మండిపడ్డారు. ఇప్పటికైనా తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో రెండో ఏఎన్ఎంలు, ఈసీ ఏఎన్ఎంలు, భాగ్య, అరుణ, భారతి, గీత పాల్గొన్నారు.

షాబాద్‌లో గజం రూ.27 వేలు

సాక్షి, సిటీబ్యూరో: కోకాపేట్, మోకిలాల్లోనే కాదు... భూమి ఎక్కడైనా బంగారమే అని మరోసారి రుజువైంది. రంగారెడ్డి జిల్లా షాబాద్‌లోనూ అనూహ్యమైన స్పందన లభించింది. హెచ్ఎండీఏ మంగళవారం ఇక్కడి 50 ప్లాట్లను ఆన్‌లైన్ బిడ్డింగ్ ద్వారా విక్రయించింది. గజానికి రూ.10 వేల చొప్పున కనీస ధర నిర్ణయించగా మంగళవారం గరిష్ఠంగా గజానికి ఏకంగా రూ.27,000 ధర పలికింది. కనిష్ఠంగా గజానికి రూ.18,000 వరకు డిమాండ్ వచ్చింది. నగటున గజానికి రూ.22,040 చొప్పున ధర పలికినట్లు హెచ్ఎండీఏ అధికారులు తెలిపారు. ఒక్కో ప్లాట్ 300 చదరపు గజాల కంటే ఎక్కువ విస్తీర్ణంలో ఉన్న 50 ప్లాట్‌లలో మొత్తం 15 వేల చదరపు గజాలను విక్రయించగా రూ.33.06 కోట్ల ఆదాయం లభించినట్లు ఈ సందర్భంగా అధికారులు తెలిపారు.

రూపు మారకుండా..

- చారిత్రక వైభవం చెక్కుచెదరకుండా..
- ఉస్మా'నయా' ఆస్పత్రిపై చర్చోపచర్చలు
- కొత్త భవనం నిర్మాణంపై సమాలోచనలు
- ఇటీవల సమావేశమైన చరిత్రకారులు, వైద్యులు, ఆర్కిటెక్టులు

సాక్షి, సిటీబ్యూరో: రోగుల అవసరాలు తీర్చలేకపోతున్న ఉస్మానియా ఆస్పత్రి ప్రత్యామ్నాయ ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి ఓ వైపు చర్యలు వేగం పుంజుకుంటుంటే మరోవైపు భవనాన్ని కూల్చడంపై చరిత్రకారుల్లో విముఖత పెరుగుతోంది. ఈ నేపథ్యంలోనే నగరంలో ఉస్మానియా ఆస్పత్రి.. భవన నిర్మాణం అంశంపై పలు రకాల చర్చలు జరుగుతున్నాయి. వీటిలో చరిత్రకారులు, వైద్యులు, ఆర్కిటెక్టులు పాల్గొని పలు సూచనలు చేస్తున్నారు.



లమకాన్‌లో సమావేశం

ఉస్మానియా జనరల్ హాస్పిటల్ (ఓజీహెచ్) చారిత్రక భవన పరిరక్షణకు సంబంధించిన చర్చ కోసం ఆర్కిటెక్చర్, హిస్టరీ, మెడిసిన్ సహా వివిధ రంగాలకు చెందిన నిపుణులు గత ఆదివారం బంజారాహిల్స్‌లోని లమకాన్‌లో సమావేశమయ్యారు ఈ సందర్భంగా చారిత్రక నిర్మాణాన్ని కాపాడుకోవడం ఆరోగ్య సంరక్షణ వ్యవస్థపై దాని ప్రభావం గురించి చర్చించారు.

ప్రైవేట్ భాగస్వామ్యం

ఉస్మానియా చారిత్రక భవనం కాపాడేందుకు పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్య విధానాన్ని అనుసరించాలనేది చర్చ సందర్భంగా ముందుకొచ్చిన కీలకమైన సూచన. ఈ నమూనా ప్రకారం,.. రాబోయే మూడు నుంచి నాలుగు దశాబ్దాల వరకు వారసత్వ భవనాన్ని పునరుద్ధరించడం పరిరక్షించే బాధ్యతను ఒక ప్రైవేట్ సంస్థ తీసుకుంటుంది, అప్పుడు ప్రభుత్వం వేరే చోట కొత్త ఆసుపత్రిని నిర్మించడంపై దృష్టి పెట్టవచ్చు. 4,500 పడకలు కలిగిన కొత్త ఆస్పత్రి కోసం స్థలంపై కూడా సమావేశంలో సూచించారు. చంచల్‌గూడ జైలులోని 150 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఖాళీ స్థలంలో దీని కోసం 25 ఎకరాలు కేటాయించవచ్చని, దీని నిర్మాణ వ్యయం రూ.2,000 కోట్లుగా అంచనా వేశారు.

అదే భవనం.. పునర్నిర్మాణం..

ఇదే విధంగా చాలా మంది నిపుణులు తమ అభిప్రాయాలను ప్రణాళికలను సమర్పించారు, ఏదేమైనా వారసత్వ భవనాన్ని కూల్చివేయడం మాత్రం సరైంది కాదని గట్టిగా చెప్పారు. వారసత్వ నిర్మాణాన్ని పరిరక్షిస్తూనే ఆస్పత్రిని విస్తరించడంపై సమగ్ర నివేదికను ప్రముఖ ఆర్కిటెక్ట్ జీఎస్‌వీ సత్యనారాయణమూర్తి ప్రతిపాదించారు. ఆయన ప్రతిపాదనలో ఇన్-పేషెంట్ అవుట్-పేషెంట్ సేవలు నర్సింగ్ హాస్టళ్ల కోసం కొత్తగా పొడిగింపు బ్లాకులతో, ప్రధాన పరిపాలనా బోధనా సౌకర్యంగా హెరిటేజ్ భవనాన్ని పునర్నిర్మించడం వంటివి ఉన్నాయి. రాతి ఆ ప్రాన్‌ను నిర్మించడం రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్ సిస్టమ్‌ను అమలు చేయడం ద్వారా వారసత్వ భవ నం గోడలు పునాదులను రక్షించాల్సిన ప్రాముఖ్యతను ఆయన నొక్కి చెప్పారు. భవనం చారిత్రక సంస్కృతికి అనుగుణంగా పునర్నిర్మాణంలో ఉపయోగించే పదార్థాల అవసరాన్ని హైలైట్ చేశారు. అంతేకాకుండా, వంతెనలు ర్యాంప్‌ల వంటి భౌతిక కనెక్షన్లపై జాగ్రత్తగా ప్లాన్ చేసి రూపకల్పన చేయడం ద్వారా క్యాంపస్‌లోని మిగిలిన ప్రాంతాలతో కనెక్టివిటీని కొనసాగించాల్సిన అవసరాన్ని వివరించారు.

రోగులు ముఖ్యం..

ఎంఎన్‌జే ఇనిస్టిట్యూట్ ఆంకాలజిస్ట్ సి.సాయిరామ్ ఆరోగ్య సంరక్షణ నిపుణుల దృక్పథాన్ని చర్చలోకి తెచ్చారు. ఆయన ఆరోగ్య రంగంలో ఓజీహెచ్ దాని అనుబంధ ఆస్పత్రుల కీలక పాత్రను ప్రస్తావించారు. ఇవన్నీ కలిసి హార్వర్డ్ తర్వాత ప్రపంచవ్యాప్తంగా రెండో అతిపెద్ద ఆస్పత్రుల సమూహంగా ఏర్పడ్డాయన్నారు. ఈ ఆస్పత్రులు అనేక రకాల సూపర్ స్పెషాలిటీ సేవల్ని అందిస్తూ పొరుగు రాష్ట్రాల రోగులకు సైతం అసాధారణమైన వైద్య సంరక్షణను అందిస్తున్నాయని గుర్తు చేశారు. సుదీర్ఘమైన న్యాయ పోరాటాల కారణంగా రోగుల సేవలకు అంతరాయం కలుగుతోందని డాక్టర్ సాయిరామ్ ఆందోళన వ్యక్తం చేశారు. వారసత్వ కట్టడం పరిరక్షణపై తమ తీర్పును అందించే సమయంలో నిరుపేద రోగుల అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలని ఆయన న్యాయవ్యవస్థను కోరారు.

మారాలి.. వద్దొద్దు..!

- చేవెళ్ల మున్సిపాలిటీ వ్యవహారంపై భిన్న వాదనలు
- శరవేగంగా అభివృద్ధి అంటున్న ప్రజాప్రతినిధులు, అధికారులు
- ఇబ్బందులు తప్పవంటున్న మరికొందరు
- మున్సిపాలిటీలో కలపొద్దంటూ ఆయా గ్రామస్తుల ఆందోళనలు

చేవెళ్ల: మున్సిపాలిటీగా మారితే చేవెళ్ల రూపురేఖలు మారతాయని కొందరు అంటుండగా.. అసలు మున్సిపాలిటీగా మార్చొద్దని, పంచాయతీగా ఉంటేనే బాగుంటుందని మరికొందరు వాదిస్తున్నారు. ఇటీవల నిర్వహించిన దశాబ్ది ఉత్సవాల్లో ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య చేవెళ్ల మున్సిపాలిటీగా మారుతుందని ప్రకటించారు. ఈ క్రమంలో చేవెళ్ల, శంకర్‌పల్లి మండలాల్లోని ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు ఆందోళన చేపడుతున్నారు. తమ గ్రామాలను మున్సిపాలిటీల్లో కలపొద్దంటూ కొద్ది రోజులుగా నిరసన వ్యక్తం చేస్తున్నారు. తమ గ్రామాలను ఎక్కడ కలుపుతారోనని శంకర్‌పల్లి మండలంలోని మోకిల, మోకిల తండా, కొండకల్, శేరిగూడ గ్రామస్తులు ఆందోళన బాటపట్టారు.



మున్సిపాలిటీలో కలపొద్దంటూ ఆందోళన చేస్తున్న ఆయా గ్రామాల ప్రజలు, నాయకులు (ఫైల్)

అపోహలు, అనుమానాలు

- మున్సిపాలిటీగా మారితే అభివృద్ధి అనుకున్నంతగా జరగదని ఆయా గ్రామస్తులు అపోహపడుతున్నారు. పన్నులు పెరుగుతాయని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అనుమానాలకు కారణాలివీ..
- ఇంటి పన్నులు ఎక్కువ అవుతాయి. ఇళ్లు కట్టుకునేందుకు త్వరగా అనుమతులు రావు.
- చిన్న పంచాయతీలను కలపటం ద్వారా ఆ గ్రామాల అభివృద్ధి కుంటుపడుతుంది.
- చేవెళ్ల మండల కేంద్రానికి దూరంగా ఉండటంతో తమ గ్రామాల అభివృద్ధిని ఎవరూ పట్టించుకోరు. ఉనికి కోల్పోతాయి.
- గ్రామీణ ప్రాంతంలో ఉండే పేద కూలీలకు ఉపాధి హామీ పథకం లాంటివి లేకుండాపోతాయి.

మారితే ఇలా..

- మున్సిపాలిటీగా మారడం ద్వారా చేవెళ్ల పెద్ద పట్టణంగా శరవేగంగా అభివృద్ధి కానుందనేది అధికారులు, ప్రజాప్రతినిధుల వాదన.
- మున్సిపాలిటీతో అధికార వికేంద్రీకరణ జరుగుతుంది.
- శానిటేషన్, రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్, అకౌంటెన్సీ, పట్టణ విస్తరణ, పబ్లిక్‌హెల్త్, ఆహార భద్రత తదితర విభాగాలు ఏర్పడతాయి. ఏ విభాగం పనులు అ విభాగం వారు చేసుకుంటూ ఎప్పటికప్పుడు పనులు చేస్తుంటారు.
- పన్నులు చెల్లించే ప్రతి పౌరుడు అభివృద్ధిపై నిలదీసే అధికారం ఉంటుంది.
- పట్టణాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ ఉంటుంది. పట్టణం శరవేగంగా విస్తరించే అవకాశం ఉంటుంది.

పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా..

చేవెళ్ల గ్రామ పంచాయతీ 1950లో ఏర్పడింది. ఇప్పటి వరకు ఏడుగురు సర్పంచులు పనిచేశారు. ప్రస్తుతం పట్టణం పంచాయతీస్థాయిని దాటి విస్తరిస్తోంది. రియల్ వ్యాపారంతో వేగంగా పెరుగుతోంది. 2011 లెక్కల ప్రకారం 7,925 జనాభా ఉండగా ప్రస్తుతం 12వేల వరకు చేరుకుందని అంచనా. అయితే మున్సిపాలిటీగా మార్చేందుకు కావాల్సిన జనాభా లేకపోవడంతో చుట్టుపక్కల ఉన్న పది గ్రామాలను కలిపి మున్సిపాలిటీగా చేయాలనే ఆలోచనలో ఉన్నారు. చేవెళ్లతోపాటు ఇబ్రహీంపల్లి, దామరగిద్ద, కేసారం, దేవుని ఎర్రవల్లి, మల్లారెడ్డిగూడ, పామెన, కందవాడ, పలుగుట్ట, ఊరేళ్ల, మల్కాపూర్ గ్రామాలను విలీనం చేయనున్నట్లు సమాచారం. వీటిలో ఒకటి రెండు గ్రామాలు అటు ఇటు అయినా మున్సిపాలిటీగా మాత్రం పక్కాగా మారుతుందని చర్చించుకుంటున్నారు. గత ఎన్నికలకు ముందు కూడా మున్సిపాలిటీగా ప్రకటన చేసినా కొన్ని అనివార్య కారణాలతో కాలేకపోయింది. ఈసారి ఎవరు అవునన్నా కాదన్నా పక్కాగా మారబోతోందని ప్రజాప్రతినిధులు చెబుతుండగా.. వద్దు మొర్రో అంటూ ఆయా గ్రామాల ప్రజలు ఆందోళనలకు దిగుతున్నారు. ఏం జరుగుతుందనేది వేచి చూడాలి.

ప్రజల ఆకాంక్ష మేరకే..



ప్రజల ఆకాంక్ష, అభీష్టం మేరకే చేవెళ్లను మున్సిపాలిటీగా మారుస్తున్నాం. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ సానుకూలంగా స్పందించారు. త్వరలో మున్సిపాలిటీగా మారేందుకు కావాల్సిన విధివిధానాలు, విలీన గ్రామాలు అన్నింటిపై స్పష్టత వస్తుంది. మున్సిపాలిటీగా మారితే శరవేగంగా అభివృద్ధి జరుగుతుంది.

– కాలె యాదయ్య, ఎమ్మెల్యే

గ్రామాలను విలీనం చేయొద్దు



గ్రామాలను మున్సిపాలిటీలో కలపొద్దు. గ్రామీణులకు అనేక ఇబ్బందులు ఏర్పడతాయి. విపరీతంగా పెరిగే ఇంటిపన్నులు కట్టలేని స్థితిలో ఉంటారు. కూలి పనులకు దూరమై ఉపాధి కరువవుతుంది. ఆయా గ్రామాలు ఉనికిని కోల్పోతాయి. ప్రభుత్వం, అధికారులు ఆలోచన చేయాలి.

– చింపుల సత్యనారాయణరెడ్డి, రాష్ట్ర పంచాయతీ చాంబర్ అధ్యక్షుడు

గ్రామాల్లో అడిషనల్ కలెక్టర్ పర్యటన



కాన్హాలో సర్పంచ్ సరితను వివరాలు అడిగి తెలుసుకుంటున్న అడిషనల్ కలెక్టర్

నందిగామ: మండలంలోని పలు గ్రామాల్లో అడిషనల్ ప్రతిమా సింగ్ మంగళవారం ఆకస్మికంగా పర్యటించారు. వెంకమ్మగూడ, చేగూరు, కాన్హా శాంతి వనం, బుగ్గోనిగూడ తదితర గ్రామాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని నర్సరీలు, పల్లె ప్రకృతి వనాలు, డంపింగ్ యార్డులను పరిశీలించి సర్పంచులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

చేవెళ్ల: మండలంలోని సాగర్ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిటెక్నిక్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విద్యాసంస్థల కార్యదర్శి డాక్టర్ మాలతి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతి పాసై ఇంటర్ ఫెయిల్ అయి పాలిసెట్ ప్రవేశ పరీక్ష రాయకపోయినప్పటికీ ప్రవేశం పొందేందుకు అవకాశం ఉందని చెప్పారు. ఆసక్తిగల అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో బుధవారం రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఉదయం 9.30గంటలకు హాజరు కావాలని సూచించారు.

ప్రతీ ఇంటికి ప్రభుత్వ పథకాలు

షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

కొందుర్గు: బీఆర్‌ఎస్ ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రతీ ఇంటికి అందాయని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. మంగళవారం మహిళా సమాఖ్య మండల అధ్యక్షురాలు సంగీత అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా సంఘాలకు రూ.20లక్షల వరకు రుణాలు ఇచ్చిన ఘనత తెలంగాణ ప్రభుత్వానిదేనన్నారు. ఇంటింటికి నల్లా కనెక్షన్ మిషన్ భగీరథ పథకం ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నామన్నారు. కేసీఆర్ కిట్, కల్యాణలక్ష్మి పథకం, రైతుబంధు, రైతు బీమా ఇలా ఎన్నో పథకాలు అమలు చేసి దేశంలోనే సీఎం కేసీఆర్ ఆదర్శంగా నిలిచాడన్నారు. ప్రజలు మరోసారి బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో తహసీల్దార్ రమేశ్ కుమార్, ఎంపీడీఓ ఆంజనేయులు, వైస్ ఎంపీపీ రాజేశ్ పటేల్, పీఏసీఎస్ చైర్మన్ దామోదర్‌రెడ్డి, ఏపీఎం జయమాలిని, కొందుర్గు సర్పంచ్ ఆదిలక్ష్మి, మహిళా సంఘం మండల కార్యదర్శి వీరమణి, కోశాధికారి అపర్ణ, ఉపాధ్యక్షురాలు సత్యమ్మ వివిధగ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

మండల సభలో ఆసక్తికర చర్చ

ఎమ్మెల్యే: అమ్మా గ్రామాలాభివృద్ధి ఎలాఉంది?
మహిళ: సారూ.. అంత బాగానే ఉంది. కానీ ఉదయం టీకి బదులుగా మద్యం తాగుతున్నారు. మేము తట్టుకోలేకపోతున్నాం. గ్రామాల్లో బెల్ట్ షాపులు బందు చేయిస్తే బాగుంటుంది.
ఎమ్మెల్యే: అమ్మా నాకు బందు చేయించాలనే ఉంది. మహిళలు సహకరిస్తే బందు చేయిస్తాం.
మరో మహిళ: మీరు ఏడ బందు చేయిస్తారు సార్ ప్రభుత్వం నడుస్తుందే మద్యం డబ్బుతో..
ఎమ్మెల్యే: మహిళలు ప్రసవించిన సమయంలో కేసీఆర్ కిట్ డబ్బులు మగ పిల్లాడు పుడితే రూ.12వేలు, ఆడపిల్ల పుడితే రూ.13వేలు వస్తున్నాయి కదా..
మహిళ: ఎక్కడ సార్ ఆరు నెలలు దాటినా డబ్బులు రావడం లేదు. వెంటనే ఎమ్మెల్యే స్పందించి వైద్యాధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. వీలైనంత త్వరలో కేసీఆర్ కిట్ డబ్బులు ఇవ్వాలని సూచించారు.

ఫొటోగ్రఫీ అందమైన కళ

స్త్రీ, శిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ విశాలరెడ్డి

కేశంపేట: ఫొటోలు, వీడియోలు అందంగా తీయడం అందమైన కళ అని స్త్రీ, శిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ విశాలరెడ్డి అన్నారు. ఫొటోగ్రాఫర్స్ మరియు వీడియోగ్రాఫర్ల జిల్లా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శంషాబాద్‌లోని ఓ ఫంక్షన్‌హాల్ జిల్లా మహాసభలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాటల్లాడుతూ.. మనల్ని మనకు, ప్రపంచానికి పరిచయం చేసేది ఫొటో, వీడియోగ్రఫీ అన్నారు. యువత స్వయం శక్తితో రాణించేందుకు ఫొటోగ్రఫీ సహకరిస్తుందని అన్నారు. ఎంచుకున్న వృత్తిలో ఉన్నతంగా రాణించాలని ఆమె ఆకాంక్షించారు.


మాట్లాడుతున్న తాండ్ర విశాలరెడ్డి

ద్రవరూప ఎరువు.. రైతుకు ఆదరువు

సాంకేతికంగా పరిజ్ఞానం పెరుగుతున్న మాదిరిగానే వ్యవసాయ రంగంలోనూ విప్లవాత్మక మార్పులు వస్తున్నాయి. గతంలో గుళికల రూపంలో లభ్యమైన యూరియా, డీఏపీ ప్రస్తుతం నానో టెక్నాలజీతో ద్రవరూప ఎరువులుగా లభిస్తున్నాయి. వ్యవసాయాధికారులు వీటిపై అవగాహన కల్పిస్తే రైతులకు పెట్టుబడి, దిగుబడిలో మేలు చేకూరనుంది.

- తగ్గుతున్న పెట్టుబడి.. పెరుగుతున్న దిగుబడి
- ఎరువుల తరలింపు సులభతరం



నానో డీఏపీ, యూరియా ద్రవరూప ఎరువులు

షాబాద్: 50కిలోల డీఏపీ, యూరియా ఎంత విస్తీర్ణానికి సరిపోతుందో అరలీటర్ ద్రవరూప డీఏపీ, యూరియా అంతే విస్తీర్ణానికి సరిపోనుంది. ఈ ద్రవరూప ఎరువుతో సుమారు 8శాతం పంట దిగుబడి పెరుగుతుందని వ్యవసాయాధికారులు వెల్లడిస్తున్నారు. మార్కెట్లో ఘన, ద్రవ రూప ఎరువులు లభిస్తున్నాయి. ఇప్పటి వరకు గుళికలుగా లభించిన యూరియా, డీఏపీ ప్రస్తుతం ద్రవరూపంలోనూ అందుబాటులోకి వచ్చాయి. మార్కెట్‌లో 50 కిలోల డీఏపీ సుమారు రూ.1,350, యూరియా బస్తా రూ.266 ధర ఉంది. ఇఫ్కో కంపెనీ మార్కెట్‌లోకి ప్రవేశపెట్టిన నానో డీఏపీ అర లీటర్‌కు రూ.600, యూరియా అరలీటర్ రూ.240 ధరతో మార్కెట్‌లో అందుబాటులో ఉంది. ద్రవరూప యూరియాపై రూ.26(266-240) డీఏపీ పై రూ.750 వరకు ప్రయోజనం చేకూరుతోంది. ఈ ద్రవరూప ఎరువుల వినియోగంపై రైతుల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యత వ్యవసాయశాఖపై ఉంది.

ద్రవరూప ఎరువులతో ప్రయోజనం

అధికారుల అంచనా ప్రకారం ద్రవరూప ఎరువులతో పంటకు సుమారు 90 శాతం ప్రయోజనం ఉంటుందని తెలుపుతున్నారు. ఘనరూప డీఏపీ వరి నాటు వేసేటప్పుడు బస్తా డీఏపీ ఎంత విస్తీర్ణంలో వినియోగిస్తామో.. ద్రవరూప డీఏపీ అర లీటర్ బాటిల్ పొలంలో పిచికారి చేస్తే అంతే సరిపోనుంది. ద్రవ రూపంలో పిచికారి చేస్తే మొక్కలు నత్రజని అవసరాన్ని సమర్థవంతంగా తీరుస్తుంది. దీంతో ఆకులలో కిరణజన్య సంయోగక్రియ పెరుగుతుంది. మొక్క వేర్లలో కణజాలం వృద్ధిచెంది, పంట ఉత్పత్తిలో పోషక విలువలను పెంచుతుంది.

అవగాహన కల్పించడంలో విఫలం

గ్రామాలలో రైతులకు ద్రవరూప ఎరువులపై అవగాహన కల్పించడంలో వ్యవసాయ అధికారులు విఫలమయ్యారు. నానో డీఏపీ, యూరియా మార్కెట్‌లో ఉందని వాటి ప్రయోజనం ఇలా ఉంటుందని రైతులకు అవగాహన కల్పించటంపై పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. వానాకాలం సాగుకు రైతులు సమయత్తమయ్యారు. కానీ అధికారులు ఇప్పటికీ పలు ఫెర్టిలైజర్స్ షాపులలో నానో డీఏపీని, యూరియాను రైతులకు సరిపడా స్టాక్ అందుబాటులో ఉంచడంలోనూ విఫలమయ్యారు. పంటసాగుపై అవగాహన సదస్సుల నిర్వహణ కరువైందని వ్యవసాయ అధికారులపై విమర్శలున్నాయి.

దిగుబడి పెరుగుతోంది



ద్రవరూప డీఏపీ, యూరియా అందుబాటులో ఉంచేందుకు కృషిచేస్తున్నాం. వరి నాటుకు ముందుగా ఒక సారి మాత్రమే నానో డీఏపీని పిచికారీ చేయాలి. నానో యూరియా లీటరు నీటికి 2 మి.లీ లేదా 4మి.లీ చొప్పున కలిపి మొదటగా పంట పెరుగుదల దశలో.. తర్వాత నెలలోపు పూతదశలో రెండో సారి పిచికారీ చేయాలి. దీంతో సుమారు 8 శాతం పంట దిగుబడి పెరుగుతుంది.

–వెంకటేశం, మండల వ్యవసాయ అధికారి, షాబాద్

సరిపడా స్టాక్ అందించాలి



ద్రవరూపంలోని నానో డీఏపీ, యూరియా బాటిల్‌ను ఆగ్రోస్, డీసీఎంఎస్ షాపులకు సరఫరా చేయాలి. రైతులకు సరిపడా స్టాక్ ఇవ్వాలి. వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలి.

– హజీజ్, ఫెర్టిలైజర్ షాపు యజమాని, నాగర్‌గూడ, షాబాద్

సదస్సులు ఏర్పాటు చేయాలి



ద్రవరూప యూరియా, డీఏపీ వాడకంపై అధికారులు రైతు సదస్సులు నిర్వహించాలి. సాగు సమయం దగ్గరకు వచ్చినా ఇంతవరకు వ్యవసాయ అధికారులు ఈ సదస్సులు ఏర్పాటు చేయడం లేదు. ఇప్పటికైనా రైతులకు అవగాహన కల్పించాలి.

– సామ ప్రతాప్‌రెడ్డి, రైతు, ఎర్రోనిగూడ

ఆస్పత్రి అప్‌గ్రేడ్‌తో పేదలకు మెరుగైన వైద్యం

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: పేదలకు వైద్యాన్ని మరింత చేరువ చేసేందుకు చేవెళ్ల ఏరియా ఆస్పత్రికి 50 పడకల నుంచి వంద పడకలకు అప్‌గ్రేడ్ చేశామని చేవెళ్ల నియోజకవర్గ ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చేవెళ్ల ఏరియా ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేదల పక్షపాతిగా పనిచేస్తోందన్నారు. ప్రభుత్వం చేవెళ్ల ఏరియా ఆస్పత్రికి ఆధునిక వైద్య పరికరాలు, భవన నిర్మాణానికి రూ.17.50 కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు వైద్యులు ఆసుపత్రికి వచ్చిన పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేయాలని సూచించారు. ఎమ్మెల్యేను కలిసిన వారి లో ఆస్పత్రి సూపరింటెండెంట్ సోమశేఖర్, సీనియ ర్ వైద్యులు లక్ష్మీకాంత్‌రెడ్డి, వైద్యులు, సిబ్బంది ఉన్నారు.


ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాలె యాదయ్యను కలిసిన ఏరియా ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది

వైద్యుడి మృతదేహానికి నివాళి

చేవెళ్ల గ్రామానికి చెందిన శ్రీనివాస ఆస్పత్రి డాక్టర్ శివాజీరావు సోమవారం గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, బీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం ఉదయం ఆయన నివాసం వద్దకు వెళ్లి మృతదేహానికి నివాళులర్పించి కుటుంబసభ్యులను ఓదార్చారు. మాజీ ఎమ్మెల్యే కెఎస్.రత్నం శివాజీరావు మృతికి నివాళులర్పించి కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు.

ఈత, తాటి వనాలకు స్థలం కేటాయించండి

గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్‌గౌడ్



శంకర్‌పల్లి: హరితహారం కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో సర్పంచ్‌లు ఈత, తాటి చెట్లను నాటే విధంగా చర్యలు తీసుకోవాలని గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు, సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్‌గౌడ్ కోరారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గ్రామాల్లోని ఖాళీ స్థలాల్లో, పార్కుల్లో ఈత, తాటి చెట్లను పెంచాలని సూచించారు. ప్రభుత్వం ఈత, తాటి వనాలను పెంచేందుకు స్థలం కేటాయించాలని కోరారు.

అప్పుల బాధ తాళలేక వ్యక్తి బలవన్మరణం

శంకర్‌పల్లి: అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన శంకర్‌పల్లి పీఎస్ పరిధిలోని రామంతపురంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన బక్కనోళ్ల పాండు(47) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అప్పుల బాధ ఎక్కువవ్వడంతో మనస్థాపం చెందిన ఆయన పురుగుమందు సేవించాడు. దీంతో ఆయనకు విరేచనాలు పెట్టడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నగరంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఆయన పరిస్థితి విషమించడంతో ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు దర్యాప్తులో ఉన్నట్లు ఎస్‌ఐ సంతోషరెడ్డి తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

శంకర్‌పల్లి: పురుగుమందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మంగళవారం మృతి చెందాడు. ఈ ఘటన శంకర్‌పల్లి పీఎస్ పరధిలోని అలాన్‌ఖాన్‌గూడలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కైలా మల్లారెడ్డి(32) జులాయి తిరుగుతూ.. మద్యం సేవిస్తూ ఆత్మహత్య చేసుకుంటానని నిత్యం తల్లిదండ్రులను బెదిరించేవాడు. సోమవారం సాయంత్రం 4గంటల ప్రాంతంలో పురుగు మందు సేవించాడు. విషయం తెలుసుకున్న కుంటుబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచన మేరకు నగరంలోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతున్న ఆయన మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుల మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సంతోష్‌రెడ్డి తెలిపారు.

పట్టు పరిశ్రమను ఆదుకోండి

పట్టు రైతుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శక్రునాయక్

తలకొండపల్లి: కిలో పట్టుగూళ్లకు రూ.550 మద్దతు ధర ఇస్తూ పట్టు పరిశ్రమను ఆదుకోవాలని పట్టు రైతుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ముదావత్ శక్రునాయక్ డిమాండ్ చేశారు. ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రంలో కిలో పట్టు గూళ్లకు రూ.600 ఇస్తుంటే హైదరాబాద్ మార్కెట్‌లో మాత్రం రూ.400 ఇస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పట్టు షెడ్ నిర్మించేందుకు 25 శాతం సబ్సిడీ ఇవ్వాలని కోరారు. మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రోత్సహకాన్ని వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం రాత్రి ఆయన తిరుమలగిరి పట్టు మార్కెట్ అసిస్టెంట్ డైరెక్టర్ సుధాకర్‌కు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ప్రశాంత్‌రెడ్డి, దేవీలాల్, నర్సింహ, ప్రకాశ్, రవీందర్‌రెడ్డి, తదితరులున్నారు.

పదవుల్లో ఉన్నవారు ప్రజాసేవ చేయాలి


పత్యానాయక్ సేవా ట్రస్టును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

- సేవా కార్యక్రమాల్లో యువత ముందుండాలి
- కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఆమనగల్లు: రాజకీయాల ద్వారా పదవులు పొందిన వారు ప్రజాసేవలో ముందుండాలని కల్వకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సూచించారు. బీఆర్‌ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు నేనావత్ పత్యానాయక్ నూతనంగా ఏర్పాటు చేసిన పత్యానాయక్ సేవా ట్రస్టును మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సేవా కార్యక్రమాల్లో యువత ముందుండాలన్నారు. పత్యానాయక్ ట్రస్టు ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు అనురాధ, దశరథ్‌నాయక్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, వైస్ ఎంపీపీ అనంతరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అర్జున్‌రావు, ఆమనగల్లు, కడ్తాల రైతు సమన్వయ సమితి అధ్యక్షులు నారాయణ, వీరయ్య, పార్టీ నాయకులు కుమార్, లచ్చిరాంనాయక్, గణేశ్, సత్యం, శివ, మల్లేశ్‌నాయక్, సయ్యద్ ఖలీల్, రమేశ్, యాదగిరి, రమేశ్‌నాయక్, అల్లాజీ, చంద్రు, వెంకటేశ్, రంజిత్, సోన శ్రీనునాయక్, నిరంజన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

యాదవులకు గొర్రెల పంపిణీ

మాడ్గుల మండలం బ్రాహ్మణపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో బ్రాహ్మణపల్లి, నర్సంపల్లి గ్రామాలకు చెందిన 64 మంది యాదవులకు ఎమ్మెల్యే గొర్రెలను పంపిణీ చేశారు. బ్రాహ్మణపల్లి, కాశెగూడెం గ్రామాల్లో పంచాయతీ కార్యాలయం భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ శంకర్‌నాయక్, మాజీ ఎంపీపీ జైపాల్‌నాయక్, సర్పంచ్‌లు జోజమ్మ, బాల్‌రెడ్డి, లక్ష్మయ్య, రమేశ్‌రెడ్డి, పార్వతమ్మ, ఎంపీటీసీ సభ్యుడు వెంకటయ్య, పార్టీ నాయకులు లాలయ్యగౌడ్, సత్తయ్య, ఆరోగ్యరెడ్డి, శ్రీను, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే లైన్ సర్వేకు రూ.7.40 కోట్లు మంజూరు

ఆమనగల్లు: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల జిల్లాలను కలుపుతూ డోర్నకల్ మీదుగా సూర్యాపేట వరకు నూతన రైల్వే లైన్ ఏర్పాటు సర్వే కోసం కేంద్ర ప్రభుత్వం రూ.7.40 కోట్లు మంజూరు చేసిందని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి చెప్పారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సూర్యాపేట, నల్గొండ మీదుగా కల్వకుర్తి, నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల మీదుగా డోర్నకల్ వరకు నూతన రైల్వే లైన్ ఏర్పాటు చేయాలని గతంలో కేంద్ర ప్రభుత్వాన్ని కోరామని గుర్తు చేశారు. ఈ మేరకు దాదాపు 296 కిలోమీటర్ల రైల్వే లైన్ సర్వే కోసం కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు.


మాట్లాడుతున్న ఆచారి

రైల్వే లైన్ సర్వేకు సహకరించిన పీఎం మోదీ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మాజీ మంత్రి డీకే అరుణ తదితరులకు ఆచారి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు నర్సింహ, లక్ష్మణ్, చెన్నకేశవులు, శ్రీకాంత్‌సింగ్ తదితరులున్నారు.

అతివేగంతో ప్రమాదం

- ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన బొలేరో
- ఇద్దరు ఆర్టీఏ ఏజెంట్లకు గాయాలు

ఇబ్రహీంపట్నం రూరల్: బొలేరో అతివేగంగా బైక్‌ను ఢీకొట్టడంతో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. ఈ ఘటన ఆదిబట్ల పీఎస్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ వెంకటేశ్ తెలిపిన ప్రకార.. యాచారం మండల కేంద్రానికి చెందిన బి.నాగరాజు, జి.శ్రీనివాస్ ఆర్టీఏ కార్యాలయంలో ఏజెంట్లుగా పనిచేస్తున్నారు. మన్నెగూడ ఆర్టీఏ కార్యాలయం నుంచి బొంగ్లూరు వద్ద టీ తాగేందుకు వారు బైక్‌పై వెళ్తున్నారు. అతివేగంగా ప్రయాణిస్తున్న బొలేరో వారి బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో వారు ఎగిరి పడ్డారు. దీంతో శ్రీనివాస్ కాలు విరగ్గా, నాగరాజుకు గాయాలయ్యాయి. రోడ్డుపై పడిన బొలేరో వెనుక నుంచి వస్తున్న మరో కారు ఢీకొట్టడంతో వారి కారు ధ్వంసమైంది. క్షతగాత్రులను స్థానికులు మహోనియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.


బొలేరోను ఢీకొట్టిన మరోకారు